## అనాథలైన ఇద్దరు కూతుళ్లు

- పెద్ద కూతురి పెళ్లి చేసి తనువు చాలించిన తల్లి
- ప్రశ్నార్థకంగా చిన్న కుమార్తె భవిష్యత్
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



తాతయ్య, అమ్మమ్మతో వైష్ణవి

# తల్లి దూరమై.. తండ్రి తోడు కరువై

శాయంపేట, జూన్ 22: మతిస్థిమితం కోల్పోయిన తండ్రి ఎక్కడికి వెళ్లాడో తెలియదు.. కాయాకష్టం చేసి పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న తల్లి ఇటీవలే కాలం చేసింది. దీంతో అనాథలుగా మారిన ఇద్దరు కూతుళ్లు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం సూరంపేట గ్రామానికి చెందిన నాసని మల్లయ్య-మల్లమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. మూడో కుమారుడు రఘు(41) వివాహం మండలంలోని మాందారిపేటకు చెందిన సంధ్య(40)తో ఇరవై ఏళ్ల క్రితం జరిగింది. వీరికి కీర్తన(18), వైష్ణవి(16) ఉన్నారు. గ్రామంలో ఉపాధి లేక బతుకుదెరువు కోసం 12ఏళ్ల క్రితం హనుమకొండకు వలస వెళ్లారు. చిన్న అద్దె గదిలో ఉంటూ కూలీనాలీ చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. కీర్తన శాయంపేటలోని కేజీబీవీలో ఎస్సెస్సీ, ఎర్రగట్టు గుట్టలోని కేజీబీవీలో ఇంటర్ పూర్తి చేసి హనుమకొండ హంటర్‌రోడ్డులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. వైష్ణవి ఇటీవల ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ పూర్తి చేసింది.

### చుట్టుముట్టిన ఆర్థిక సమస్యలు

కూలీనాలితో వచ్చే డబ్బులు కుటుంబ పోషణకు సరిపోక ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి అప్పులు ఎక్కువయ్యాయి. ఏం చేయాలో తెలియక రఘు నిత్యం మదనపడేవాడు. ఈ క్రమంలో అతడు ఐదేళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. భార్య సంధ్య అతడికి మానసిక వైద్య నిపుణుల వద్ద చికిత్స అందించినా నయం కాలేదు. భర్త ప్రవర్తనను చూసి ఇటు భార్య, తండ్రికి ఏమైందో తెలియక పిల్లలు ఆందోళన చెందేవారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం రఘు ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. రఘు వెళ్లిపోయిన తర్వాత అతడి తండ్రి మల్లయ్య అనారోగ్యంతో కాలం చేశాడు. ఈ పరిస్థితులతో దిక్కుతోచని సంధ్య తన ఇద్దరు పిల్లలతో మాందారిపేటలోని తన తల్లిగారి ఇంటికి వచ్చింది. కాయాకష్టం చేసుకుంటూ పిల్లలను చదివించేది. ఏడాది క్రితం సంధ్యకు క్యాన్సర్ రావడంతో పలు దవాఖానల్లో చికిత్సలు చేయించుకుంది. ఇక తాను బతకనని తెలిసి పిల్లల భవిష్యత్‌పై ఆందోళన పడేది. కనీసం పెద్ద కూతురు పెళ్లినైనా కళ్లారా చూడాలని భావించిన ఆమె నెల రోజుల క్రితం కీర్తనకు వివాహం చేసింది. ఇటీవల సంధ్య ఆరోగ్యం క్షీణించడంతో ఆమె తల్లిదండ్రు లు వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ ఈ నెల 12న మృతిచెందింది. కుమారులు లేకపోవడంతో వైష్ణవి తలకొరివి పెట్టింది. ఇటు తండ్రి జాడ తెలియక.. అటు తల్లి మరణంతో అక్కాచెల్లెళ్ల ఆలనాపాలనా చూసేవారు కరువయ్యారు. అమ్మమ్మ, తాతయ్య.. నానమ్మ వృద్ధాప్యంలో ఉండడంతో చిన్న కూతురు వైష్ణవి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఉన్నత చదువులు చదవాలని వైష్ణవి కోరిక. ఎవరైనా దాతలు ముందుకొచ్చి చేయూతనివ్వాలని, భవిష్యత్‌కు అండగా నిలువాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. సాయం చేయాలనుకునే వారు 81868 78557(బలభద్ర గణేశ్) నంబర్‌కు ఫోన్‌పే ద్వారా పంపించి ఆదుకోవాలని కోరుతున్నారు.



సంధ్య-రఘు దంపతులు(ఫైల్)

# కలగానే 30 పడకల దవాఖాన

- కాజీపేటలో మెటర్నిటీ హాస్పిటల్ కోసం ప్రజల ఎదురుచూపులు
- ప్రస్తుతం డిస్పెన్సరీ సేవలకే పరిమితం

కాజీపేట, జూన్ 22 : అంగట్లో అన్ని ఉన్నా... అల్లుడి నోట్లో శని అన్న చందంగా కాజీపేట పట్టణ ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగానే మారింది. పట్టణంలోని మున్సిపల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో 30 పడకల మెటర్నిటీ దవాఖాన నిర్మాణం కోసం రెండు దశాబ్దాల కింద ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. పట్టణంలో ప్రభుత్వ ప్రసూతి దవాఖాన ఏర్పాటైతే విలీన గ్రామాలతో పాటు నగరవాసులకు సౌకర్యవంతంగా ఉంటుంది. కానీ పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రసూతి దవాఖాన ప్రతిపాదనలు అటకెక్కాయి. స్థానికంగా మెటర్నిటీ దవాఖాన లేకపోవడంతో నిరుపేదలైన మహిళలు వైద్యం కోసం హనుమకొండ, వరంగల్‌కు వెళ్లాల్సి వస్తున్నది. వ్యయ, ప్రయాసలకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2006లో రూ.50 లక్షలతో మున్సిపల్ భవనంలో ప్రసూతి దవాఖాన ప్రారంభానికి సిద్ధం చేశారు. కాగా, అధికారులు, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయం కుదరకపోవడంతో దవాఖాన అలంకార ప్రాయంగా మిగిలిపోయింది. కాజీపేట, మడికొండ, కడిపికొండ, రాంపూర్, టేకులగూడెం, అయోధ్యపురం, కుమ్మరిగూడెం, తరాలపల్లి, భట్టుపల్లి తదితర విలీన గ్రామాల్లో దాదాపు మూడు లక్షల మంది వరకు జనాభా నివసిస్తుంటారు. 2016లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి 30 పడకల మెటర్నిటీ దవాఖాన ఏర్పాటు కోసం లాంఛనంగా పనులను ప్రారంభించారు కానీ పనులు ముందుకు సాగలేదు. దవాఖాన నిర్మాణం కోసం పలు ధపాలుగా ప్రభుత్వ భూములను పరిశీలించారు. కానీ ఆ భూములు పట్టణంలోని ప్రధాన రోడ్డుకు దూరంగా ఉండడంతో పట్టణ, విలీన గ్రామల ప్రజలు దవాఖానకు వెళ్లేందుకు కష్టమవుతుందని అభ్యంతరం చేయడంతో ఆ ప్రతిపాదనలు నిలిచిపోయాయి. ప్రజలు ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న మున్సిపల్ ఆఫీస్ ఆవరణలోనే దవాఖాన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దవాఖాన నిర్మాణం కోసం ప్రణాళికలు మొదలు పెట్టారు. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కాగా, అప్పటి ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ నేతృత్వంలో కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో పేదలకు ప్రభుత్వ వైద్యం అందించాలని డిస్పెసరీని ఏర్పాటు చేయించారు. వైద్యుడితో పాటు నలుగురు సిబ్బంది ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. అప్పటి నుంచి ఆ డిస్పెసరీలోనే పట్టణ ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారు. వైద్యుడి గదితో పాటు, ఔషధాల స్టోర్ కోసం మరో చిన్న గదిని కేటాయించారు. ప్రస్తుతం ఆ మందుల స్టోర్ గది శిథిలావస్థకు చేరింది.



వైద్య సేవలు పొందుతున్న రోగులు



ఖాళీగా ఉన్న కార్పొరేషన్ భవనం, గదులు

### దవాఖాన లేకపోవడం వల్ల ఇబ్బందులు..



కాజీపేటలో మెటర్నిటీ దవాఖాన ఏర్పాటు కోసం ఇరవై ఏండ్లుగా ఎదురు చూస్తున్నాం. ప్రసూతి దవాఖాన ఇక్కడ ఏర్పాటైతే మహిళలు సుదూర ప్రాంతాల్లోని దవాఖానలోకి వెళ్లే పరిస్థితి ఉండదు. నిరుపేద మహిళల ఇబ్బందులు గుర్తించి కాజీపేటలో మెటర్నిటీ దవాఖానను ఏర్పాటు చేయాలి.

– బైరపాక శ్రీనివాస్, అయోధ్యపురం

# ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్

- కసరత్తు చేస్తున్న పంచాయతీరాజ్ అధికారులు
- హాజరు వేసుకొని పోతామంటే కుదురదిక..
- జడ్పీ, 12 మండలాల్లో ఏర్పాటు

హనుమకొండ, జూన్ 22 : ఇక డుమ్మాలు కుదరవు.. జిల్లా, మండల పరిషత్తు కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగుల డుమ్మాలకు చెక్ పడనుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని ఆఫీసుల్లో (హనుమకొండ జడ్పీ మినహాయించి) మ్యానువల్ విధానం కొనసాగుతున్నట్లు సమాచారం. దీంతో కొందరు ఉద్యోగులు విధులకు హాజరుకాకపోయినా, ఆలస్యంగా వచ్చినా హాజరు వేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. వీటిని అరికట్టిందుకు ప్రభుత్వం కార్యాలయాల్లో ఫేస్ బయోమెట్రిక్ (ముఖచిత్ర హాజరు) విధానం అమలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

**జడ్పీలో ఆధార్ బీఏఎస్ యాప్ ద్వారా హాజరు..**

ప్రస్తుతం జడ్పీలో ఆధార్ బీఏఎస్ యాప్ ద్వారా హాజరు తీసుకుంటున్నారు. గత కలెక్టర్ ఆదేశాలతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. అయితే కొన్నేళ్ల క్రితం వేలిముద్ర హాజరు ఉండేదని, మిషన్లు సక్రమంగా పని చేయకపోవడంతో మూలన పడ్డాయని కార్యాలయ ఉద్యోగులు తెలిపారు. అయితే, ప్రస్తుతం జిల్లా, మండల పరిషత్ కార్యాలయాల్లో ఉద్యోగులు, సిబ్బంది సమయ పాలన పాటించకపోవడం, విధులకు రాకపోయినా వచ్చినట్లు సంతకాలు చేయడాన్ని గుర్తించిన పంచాయతీరాజ్ రాష్ట్ర అధికారులు కార్యాలయాల్లో ఈ నెల నుంచి ఫేస్ బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జడ్పీ, 12 మండల పరిషత్ కార్యాలయాల్లో ఫేస్ బయోమెట్రిక్ మిషన్లు ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. ఇందుకుగాను ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా రోజువారీగా నమోదైన వివరాలను జడ్పీ కార్యాలయం సేకరించి కలెక్టర్ ద్వారా పంచాయతీరాజ్ కార్యాలయానికి పంపిస్తారు.

**అదనపు భారమంటున్న ఉద్యోగులు..**

జిల్లా, మండల పరిషత్ కార్యాలయాల్లో అమలు చేయనున్న నూతన విధానంతో మరింత అదనపు భారం పడే అవకాశం ఉందని పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు వాపోతున్నారు. బయోమెట్రిక్ మిషన్లు కొనుగోలు చేసేందుకు నిధులు ఎలా అని తర్జనభర్జన పడుతున్నారు. ఇప్పటికే జడ్పీ, మండల పరిషత్‌లలో నిధుల లేమి, ఆఫీసుల మెయింటనెన్స్‌కు ఇబ్బందికరంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో మిషన్లు ఏర్పాటు ఎట్లా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఏర్పాట్లు చేస్తున్నాం..

జిల్లాలోని జడ్పీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ఫేస్ బయో మెట్రిక్ విధానం అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జడ్పీలో ఆధార్ బీఏఎస్ హాజరు విధానం అమల్లో ఉంది. మండల పరిషత్‌లలో మ్యానువల్ హాజరు విధానం ఉంది. మండల పరిషత్‌ల నుంచి ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నాం. సేకరించిన వివరాలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపిస్తాం.

– ఎన్ విద్యాలత, హనుమకొండ జడ్పీ సీఈవో

## వివాహిత అనుమానాస్పద మృతి

శాయంపేట, జూన్ 22 : మండలంలోని కొప్పులలో వివాహిత అబ్బోజు హేమలత అనుమానాస్పదంగా మృతి చెందినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌రావు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన అబ్బోజు రాజాచారి ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. అయితే భార్య హేమలతపై రాజాచారి అనుమానం పెంచుకుని కొట్టేవాడు. ఈ నెల 20 తేదీన భార్యకు నీరసంగా ఉందంటే సెలైన్ పెట్టి ఇంజిక్షన్ ఇవ్వగా అస్వస్థతకు గురైంది. గమనించి వెంటనే కుటుంబ సభ్యులు పరకాలలోని గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలన అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 21న హేమలత మృతి చెందింది. సెలైన్ పెట్టి ఇంజిక్షన్ ఇవ్వడంతోనే హేమలత మృతిచెందిందని ఆమె పెద్ద కుమార్తె గాదె శివాని ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సీఐ తెలిపారు.

## గుట్కా ప్యాకెట్లు పట్టివేత

సుబేదారి, జూన్ 22 : హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధి కిషన్‌పురాలోని ఓ పాన్‌షాప్‌లో గుట్కా ప్యాకెట్లను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పాన్ షాప్ ఓనర్ కనుకుంట్ల శివ నుంచి రూ.8వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

**ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్**

మచిలీబజార్‌లో ఆదివారం పేకాడుతున్న ఎనిమిది మందిని పట్టుకొని, రూ.13వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.

## పక్షుల వేట అడ్డగింత

శాయంపేట, జూన్ 22 : మండలంలోని ప్రగతి సింగారం శివారు చలివాగు బ్రిడ్జి ప్రాంతంలో ఆదివారం వేటగాళ్లను పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ జిల్లా బాధ్యుడు మారెపల్లి సునీల్ తెలిపారు. ఏపీలోని పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం చెరుకుపాలెంకు చెందిన సానికొమ్ము బాబు, సానికొమ్ము రామాంజీ బ్రిడ్జి పరిసరాల్లో ఇనుప స్ప్రాంజీతో పక్షులను వేటాడుతుండగా అన్నెబోయిన విజేందర్‌తో కలిసి అడ్డుకున్నట్లు తెలిపారు. వీరు ఆత్మకూరు మండలం కటాక్షపూర్‌లో ఉంటూ నాటు మందులు విక్రయిస్తుంటారని తెలిపారు. అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేశ్

## డ్రగ్స్‌తో జీవితం అంధకారం

ధర్మసాగర్, జూన్ 22 : డ్రగ్స్‌కు అలవాటైతే జీవితం అంధకారమవుతుందని ఎస్సై సురేశ్ అన్నారు. ఆదివారం వేలేరు కేజీబీవీలో అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

# సీడ్ ప్లాంట్ల యజమానుల సిండికేట్ దందా

- రెండు నెలలైనా రైతులకు చెల్లించని ధాన్యం డబ్బులు
- బోనస్ పేరుతో జాప్యం
- ఏజెంట్ల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- పట్టించుకోని యజమానులు



సీడ్ ప్లాంట్లకు ధాన్యం తరలిస్తున్న రైతులు

కమలాపూర్, జూన్ 22 : సీడ్ ప్లాంట్ల యజమానులు సిండికేట్ దందా కొనసాగిస్తూ తాము చెప్పిందే వినాలి.. లేదంటే డబ్బులు పడవంటూ సాగదీస్తున్నారు.. యాసంగిలో వరి సాగు చేసేందుకు పలు సీడ్ ప్లాంట్ల యజమానులు ఏజెంట్లను పెట్టుకుని గ్రామాల్లో విత్తనాలు పంపిణీ చేశారు. క్వింటాల్ ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర, బోనస్ కంటే రూ.200 ఎక్కువ చెల్లిస్తామని చెప్పడంతో నమ్మిన రైతులు అధికంగా దొడ్డు, సన్న రకాలు సాగు చేశారు. తీరా ధాన్యం అమ్మి రెండు నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించకుండా రేపు మాపు అంటూ దాటవేస్తున్నారు. ప్రభుత్వం బోనస్ డబ్బులు చెల్లించిందా? లేదా ఎగనామం పెడుతుందా? చెల్లిస్తే అదనంగా ఇవ్వాల్సి వస్తుందని.. లేదంటే ప్రభుత్వ మద్దతు ధర చెల్లించి చేతులు దులుపుకోవచ్చని సీడ్ ప్లాంట్ల యజమానులు ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఒప్పందం ప్రకారం సీడ్ ప్లాంట్ల యజమానులు డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు రైతులు వాపోయారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ శివారులోని పరకాల క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సీడ్ ప్లాంట్ల యజమానులు మండలంలోని కమలాపూర్, ఉప్పల్, శంభునిపల్లి, కన్నూరు, గూడూరు, దేశరాజ్‌పల్లి, కానిపర్తి, భీంపల్లి, గుండేడు తదితర గ్రామాల్లో ఏజెంట్లను పెట్టుకుని విత్తనాలు పంపిణీ చేశారు. కమీషన్ల కోసం ఏజెంట్లు ఏప్రిల్ 2024లో యాసంగి ధాన్యం రైతుల నుంచి సేకరించి పెద్ద ఎత్తున సీడ్ ప్లాంట్లకు తరలించారు. ధాన్యం కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా రైతులకు డబ్బులు చెల్లించడం లేదు. దీంతో డబ్బుల కోసం రైతులు ఏజెంట్ల ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో సాగుకు సిద్ధమవుతున్న విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు తెలిపారు. ధాన్యం డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న సీడ్ ప్లాంట్ల యజమానులు, ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### రెండు నెలలైనా ఒక్క రుపాయి ఇవ్వలే..



సీడ్ ప్లాంట్ల ఏజెంట్ల మాయమాటలు నమ్మి విత్తనాలు తీసుకుని యాసంగిలో 14ఎకరాల్లో ధాన్యం సాగు చేశాను. ఓపీ సీడ్ విత్తనాలు ఇచ్చే ముందు ప్రభుత్వ మద్దతు ధర కంటే అదనంగా రూ.100 చెల్లిస్తామన్నరు. ఏజెంట్లను డబ్బులు అడిగితే ప్రభుత్వం బోనస్‌పై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పుడే ఇస్తరా.. రెండు నెలలు దాటితేనే డబ్బులు ఇస్తమంటూ మాట్లడుతున్నరు. వానకాలం వరినాట్లు వేసే సీజన్ వచ్చింది ఇంకెప్పుడిస్తరు. ఒక టైమంటు చెప్పడం లేదు. ఏజెంట్లను నిలదీసిన రైతులకు రూ.5వేలు, 10వేలు ఇస్తూ దాటవేస్తున్నరు.

– ఎర్రబెల్లి సంపత్‌రావు, రైతు, ఉప్పల్

## జేఈఈ, నీట్, ఎంసెట్‌లో కోచింగ్‌కు దరఖాస్తులు

ఏటూరునాగారం, జూన్ 22 : ఉమ్మడి జిల్లా పరిధిలో గిరిజన ఆశ్రమ కళాశాలలు, గురుకులాల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు జేఈఈ, నీట్, ఎంసెట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు రెసిడెన్షియల్ పద్ధతిలో కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 28లోగా హనుమకొండలోని స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7675978439, 8328546015 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

హనుమకొండ చౌరస్తా, జూన్ 22 : జిల్లాలో క్రీడామైదానాలు లేని విద్యాసంస్థలను మూసివేయాలని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. ఉమ్మడి ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో హనుమకొండ కాళోజీ జంక్షన్ నుంచి జేఎన్‌ఎస్ వరకు ఒలింపిక్ డే రన్ నిర్వహించారు. డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటు

భీమదేవరపల్లి, జూన్ 22 : కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మండలంలోని వంగర గ్రామానికి చెందిన రఘునాయకుల వెంకటరెడ్డి, వొళ్లాల రమేశ్, చిట్టి సతీశ్‌రెడ్డి, శ్రీరామోజు మొండయ్య మూడు సీసీ కెమెరాలను అందజేసినట్లు ఎస్సై దివ్య తెలిపారు. నేర నియంత్రణలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని ఆమె కోరారు.

## నేడు బల్దియాలో గ్రీవెన్స్

వరంగల్, జూన్ 22 : గ్రేటర్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## రైల్వే అధికారులకు రూ.25 వేల నగదు అవార్డు

కాజీపేట, జూన్ 22 : దక్షిణ మధ్య రైల్వే జోన్ జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కాజీపేట రైల్వే అధికారులకు గ్రూప్ నగదు (క్యాష్) అవార్డును ఆదివారం ప్రకటించారు. కాజీపేటలో రూ.7.5కోట్లతో అధునాతన సౌకర్యాలు, వసతులతో మోడల్ రైల్వే రన్నింగ్ రూంను షెడ్యూల్ ప్రకారం నిర్మించినందుకు స్థానిక రైల్వే అధికారులను ఆయన మెచ్చుకున్నారు. కాజీపేట రైల్వే అధికారుల సమష్టి కృషికి ఆయన రూ.25వేల నగదు బహుమతి ప్రకటించారు. కాజీపేట రైల్వే సీనియర్ డీఎంఈ వెంకట్ కుమార్, సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి, స్టేషన్ మాస్టర్ అగ్గి రవీందర్, సీసీసీ ఫోర్‌మెన్ మౌలానా షరీఫ్, ఐవోడబ్ల్యూ, పీడబ్ల్యూ, క్రూ ల్యాబీ, రన్నింగ్ రూం మెయింటనెన్స్ తదితర శాఖలకు చెందిన రైల్వే అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.




మాందారిపేట– సూరంపేట దారిలో వంగిపోయి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

## డేంజర్‌గా విద్యుత్ స్తంభాలు

### పట్టించుకోని సంబంధిత అధికారులు

శాయంపేట, జూన్ 22 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతోంది. స్తంభాలు వంగిపోయి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. మండలంలోని మాందారిపేట నుంచి సూరంపేట గ్రామానికి వెళ్లే దారి పక్కన పలుచోట్ల విద్యుత్ స్తంభాలు వంగి ప్రమాదకరంగా ఉన్నాయి. వ్యవసాయ బావి వద్ద వేసిన స్తంభం పూర్తిగా వంగిపోయింది. ప్రధాన విద్యుత్ లైన్ కావడంతో బలమైన గాలులకు స్తంభం బావిలో పడితే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందంటున్నారు. అధికారులు స్పందించి సరిచేయాలని కోరుతున్నారు. అలాగే శాయంపేట నుంచి మైలారంకు వెళ్లే దారిలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. దీనిపై 'నమస్తే'లో కథనం ప్రచురితమైంది. అయితే విద్యుత్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పైగా 'మేము వేసిన స్తంభాలు కాదు.. లూజ్ వైర్లకు మేమేం చేయాలి' అంటూ మాట్లాడుతున్నారని రైతులు తెలిపారు. ఏదైనా జరిగే అధికారులదే బాధ్యత అని చెప్పారు.



మొక్క నాటుతున్న జిల్లా సంక్షేమాధికారి జయంతి

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 22 : పర్యావరణ సమతుల్యతను పెంపొందించడానికి మొక్కలు నాటాలని జిల్లా సంక్షేమాధికారి జయంతి పిలుపునిచ్చారు. సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మిషన్ పరివర్తన–నాశముక్త భారత్ అభియాన్ సందర్భంగా ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో ప్లానిటేషన్ ప్రోగ్రాంను జిల్లా సంక్షేమ కార్యాలయం, యాంటీ నార్కోటిక్ సౌజన్యంతో నిర్వహించగా, డీడబ్ల్యూవో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఎన్‌సీసీ అధికారులు నహీదా, స్వామి పాల్గొన్నారు.

## 'ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి'

ఆత్మకూరు, జూన్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం అన్నారు. ఆదివారం ఆత్మకూరులో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్ ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. 18 నెలలు గడిచినా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన వారికి ఆర్థిక చేయూతనివ్వాలని కోరారు. లేకపోతే విడుతల వారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండీ బాబుమియా, ప్రధాన కార్యదర్శి దొంకదువ్వ రాజయ్య, మాజీ సర్పంచ్‌లు నాగెల్లి సామెల్, రేవూరి జనార్దన్‌రెడ్డి, జిల్లెల రాజు, తోట గణపతి, పెరుమాండ్ల స్వామి, వడ్డేపల్లి నర్సయ్య, పులిచేరు పైడి పాల్గొన్నారు.

# సొంత భవనం నిర్మించేది ఎప్పుడో?

- దూరవిద్యా కేంద్రంలోనే కొనసాగుతున్న కేయూ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ
- హాస్టల్ వసతి లేక బయటే ఉంటున్న విద్యార్థినులు
- డెవలప్‌మెంట్ పేరిట ఫీజు వసూళ్లు
- ప్రతిపాదనలు పంపించాం : ప్రిన్సిపాల్ భిక్షాలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 22 : కాకతీయ విశ్వవిద్యాలయం కింద నడుస్తున్న ఏకైక మహిళా ఇంజినీరింగ్ కాలేజీ.. రాష్ట్రంలోని కాకతీయ యూనివర్సిటీ కింద స్వయం–ఫైనాన్సింగ్ విభాగంలోని ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీల్లో ఒకటి. విద్యార్థినులను నాణ్యమైన ఇంజినీర్లుగా తీర్చిదిద్దేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం 2013–2014 విద్యా సంవత్సరంలో ప్రత్యేకంగా యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ గర్ల్స్‌ను ప్రారంభించింది. అప్పటి నుంచి మహిళా ఇంజినీరింగ్ కాలేజీకి సొంత భవనం కరువైంది. దూరవిద్యా కేంద్రంలోని ఓ అకాడమిక్ బ్లాక్‌లో దీన్ని నడిపిస్తున్నారు. ఇందులో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌కు చెందిన సుమారు వెయ్యి మంది విద్యార్థినులు అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం ఇంజినీరింగ్, సాంకేతిక విద్య అభ్యసించే విద్యార్థులకు చాలా ఉపాధి అవకాశాలు ఉన్నాయి. కాగా, ఈ కాలేజీలో కనీసం హాస్టల్ వసతి కల్పించకపోవడంతో విద్యార్థినులను బయట హాస్టళ్లలో ఉంటూ విద్యను కొనసాగిస్తున్నారు. ఇందులో చదివే 90 శాతం మంది పేద, బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థినులే. అందరూ సుదూర గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్నారు. ప్రతి సంవత్సరం డెవలప్‌మెంట్ ఫీజు పేరిట రూ.9 వేలకు పైచిలుకు వసూలు చేస్తున్నారని విద్యార్థినులు వాపోతున్నారు. ప్రైవేట్ యూనివర్సిటీ వలే ఫీజుల దోపిడీ చేస్తున్నారే తప్ప విద్యార్థినులకు కనీసం హాస్టల్ వసతి కల్పించడం లేదని మండిపడుతున్నారు. ప్రైవేట్ హాస్టల్స్‌లో ఉంటున్నామని, అక్కడ సెక్యూరిటీ కరువవుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే హాస్టల్ ఖర్చులు భరించలేక డ్రాపౌట్ అవుతున్న విద్యార్థులూ చాలా మంది ఉంటున్నారు. కనీసం అకడమిక్ బ్లాక్ లేక ఎస్డీఎల్‌సీఈ బిల్డింగ్‌లో కాలం వెళ్లదీసే పరిస్థితి దాపురించిందని చెబుతున్నారు. కనీస ల్యాబ్ సౌకర్యాలు లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని, 14 సంవత్సరాలు గడిచినా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయకపోవడం వల్ల ఫీజుల భారంతో పాటు రెగ్యులర్ ఫ్యాకల్టీ రిక్రూట్ కాలేదని, ఉన్నత విద్యాకోర్సులు, పరిశోధనకు సంబంధించిన విషయంలో వెనకబడిపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని, ప్రత్యేక అకాడమిక్ బ్లాక్ నిర్మించాలని, అదేవిధంగా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయాలని పలుమార్లు వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రాంచంద్రంకు వినతిపత్రాలు అందజేసినా స్పందించడం లేదని వాపోతున్నారు.

### ప్రతిపాదనలు పంపించాం..



ఏళ్ల తరబడి కాకతీయ యూనివర్సిటీ గర్ల్స్ ఇంజినీరింగ్ కాలేజీకి సొంత భవనం, హాస్టల్ లేదు. దూరవిద్యా కేంద్రంలోని ఓ అకాడమిక్ బ్లాక్‌లో నిర్వహిస్తున్నాం. సొంత భవనం, కాలేజీ హాస్టల్ కోసం ప్రతిపాదనలు పంపించాం. ఇంకా నిధులు మంజూరు కాలేదు.

– భిక్షాలు, కేయూ గర్ల్స్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

**BUSINESS OFFER**

★Need Monthly Returns? Get your Own International Capital Market Trading Account. Profit Sharing/Fixed Returns, Safe & Secure. 6301859174.
NT-325295

**CHANGE OF NAME**

★I, RAJITHA MUPPIDI (Old Name) R/o H.No. 25-7-55, Vishnupuri, Kazipet, Hanumakonda Dist. TG. I have changed my name from RAJITHA MUPPIDI to MEKALA LAVANYA (New Name) W/o MEKALA SHYAM KUMAR for all future purposes.
NTW-6717

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565